

నిఘా నేత్రాలు నిద్రావస్థలో..

స్తంభాలపై వెక్కిరిస్తున్న సీసీ కెమెరాలు



చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో నేలను చూస్తున్న సీసీ కెమెరా



సిద్దిపేటలోని శ్రీనగర్‌కాలనీలో తిరుగుముఖం వేసిన సీసీ కెమెరా



మద్దూరు మండలం నర్సాయపల్లిలో పనిచేయని కెమెరా



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానం సమీపంలో కనెక్షన్ ఊడిపోయిన సీసీ కెమెరా



నారాయణరావుపేట హైస్కూల్ వద్ద ధ్వంసమై కనిపిస్తున్న సీసీ కెమెరా



కొండపాకలో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు



హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా ప్రధాన కూడలిలో ఉత్సవ విగ్రహాలుగా సీసీ కెమెరాలు



కోహెడలోని అంబేద్కర్ సెంటర్‌లో సీసీ కెమెరాల నేలచూపులు

హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అమర్చిన సీసీ కెమెరాలు కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఇటీవల పట్టణంలో దొంగల బెడద ఎక్కువైంది. దొంగలను పట్టుకోవడానికి సహకరించాల్సిన సీసీ కెమెరాలు నిద్రావస్థలో వెక్కిరిస్తున్నాయి.

నారాయణరావుపేట మండలంలోని 10 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. కానీ, 90శాతం కెమెరాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగేలా ఈ కెమెరాలను కిందకి వంచడం, ధ్వంసం చేయడం జరిగింది.

కేవలం హుస్నాబాద్, నారాయణరావుపేట ప్రాంతాల్లోనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

- చాలా చోట్ల పనిచేయని వైనం
- జనసంచార ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- దొంగతనాల విచారణకు ఆటంకం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 2 : ప్రతీ కదలికను పర్యవేక్షించాల్సిన సీసీ కెమెరాలు నిద్రావస్థలో చేరాయి. జిల్లాలోని 499 గ్రామాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లుగా అప్పట్లో ప్రకటించారు. కానీ ఇందులో అడపాదడపా మినహా మరెక్కడా పనిచేయడం లేనట్లుగా స్పష్టమవుతోంది.





జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో, కుకునూరుపల్లి పంచాయతీలో పనిచేయని సీసీ కెమెరాల స్ర్కీన్లు

దొంగతనాలకు ఆస్కారం

జిల్లాలో ఇటీవల దొంగల బెడద ఎక్కువైంది. పట్టపగలే ఇండ్లు, దుకాణాల తాళాలు పగలగొట్టి నగదు, ఆభరణాలను అపహరిస్తున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. అయితే దొంగలను పట్టుకోవడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. ఇందుకు సీసీ కెమెరాలు నిరూపయోగంగా మారడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా ఉంటే దొంగతనాలు చేయడానికి సైతం తర్జనభర్జన పడే పరిస్థితి ఉండేది. కానీ యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. జిల్లాలోని చాలాచోట్ల ఇటీవల దొంగతనాలు జరగడమే ఇందుకు నిదర్శనం. ప్రధాన రహదారులపై మినహాయిస్తే గ్రామాలు, పట్టణాలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు స్తంభాలపై వెక్కిరిస్తున్నాయనే చెప్పాలి. ఇక ఇసుక అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లోనైతే సీసీ కెమెరాల కంటపడకుండా ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సీపీ మేడమ్ దృష్టిసారిస్తేనే..

జిల్లా నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనురాధ తనదైన ముద్ర వేస్తున్నారు. అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతూ అక్రమార్కులకు సవాల్ విసురుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలోనూ అన్ని కోణాల్లో పర్యవేక్షిస్తున్నారు. అయితే సీసీ కెమెరాల నిర్వహణపై ఆమె ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించడం, కొత్త కెమెరాలను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ఏర్పాటు చేసినట్లుగానే దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా క్షేత్రస్థాయిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హైవే 161.. జాతికి అంకితం

- సంగారెడ్డి-మదీనాగుడా హైవే విస్తరణ
- మెదక్- ఎల్లారెడ్డి రోడ్డు వెడల్పు
- పటాన్‌చెరు సభలో శ్రీకారం చుట్టనున్న ప్రధాని నరేంద్ర మోదీ



161 జాతీయరహదారి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 2 : హైదరాబాద్-ముంబై 65వ నంబర్ హైవేపై మామిడిపల్లి నుంచి అకోలా వరకు నిర్మించిన 161 నంబరు హైవేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ నెల 5వ తేదీన సంగారెడ్డి జిల్లాకు రానున్న మోదీ పలు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా పటాన్‌చెరు మండలం పటేల్‌గూడ వద్ద 5న జరగనున్న బహిరంగసభలో పాల్గొననున్న ఆయన అక్కడే ఆయా పనులను ప్రారంభించనున్నారు. రూ.1,409 కోట్ల వ్యయంతో నిర్మించిన మామిడిపల్లి జంక్షన్ నుంచి అకోలా 161 నంబరు హైవేపై రాంసానిపల్లి వరకు నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించనున్నారు. అలాగే సంగారెడ్డి క్రాస్ రోడ్డు నుంచి మదీనాగూడ వరకు ఉన్న 46 కిలోమీటర్ల 65వ నంబరు హైదరాబాద్-ముంబై హైవే విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో సతమతమయ్యే ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం రూ.1,298 కోట్ల అంచనాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డుతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో వెహికిల్ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. సంగారెడ్డి, కంది చౌరస్తాలు, ఐఐటీహెచ్, రుద్రారం సమీపంలో, లక్దారం, ఇస్నాపూర్ చౌరస్తాల్లో ఫ్లైఓవర్లను నిర్మించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

మెదక్-ఎల్లారెడ్డి హైవేకు శంకుస్థాపన

ఇక మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు 43.91 కిలోమీటర్ల 765-డి నంబరు హైవే పనులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు రూ.500 కోట్ల అంచనాలతో కూడిన ఈ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. మెదక్ శివారులోని ఎల్లమ్మగుడి వద్ద నుంచి హవేళీఘన్‌పూర్ మీదుగా ఎల్లారెడ్డి వరకు ఈ హైవే పనులు చేపట్టనున్నారు.

ప్రధాని సభ ఏర్పాట్లపై సమావేశం

పటాన్‌చెరు, మార్చి 2 : ప్రధాని మోదీ పర్యటన, బహిరంగ సభపై ఉన్నతస్థాయి అధికారులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీన ప్రధాని సభ జరగనున్న ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఎస్ఎస్‌జీ రక్షణ అధికారులు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల విస్తరణ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ సభా ప్రాంగణం నుంచి వర్చువల్‌గా ప్రారంభించబోతున్నారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయసంకల్ప సభలో ప్రసంగిస్తారు.

టీబీ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి

- అనీమియాతో బాధపడుతున్న రోగులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 2 : జిల్లాలో టీబీ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ మనుచౌదరి వైద్య శాఖ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా తీవ్ర అనీమియాతో బాధపడుతున్న బాలబాలికలకు ఆర్బీఎస్కే సిబ్బంది వారి ఇంటికి వెళ్లి పోషకాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో సంవత్సరం నుంచి జరిపిన పరీక్షల వివరాలను అందించాలని కోరారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హెల్ప్‌డెస్క్‌ని పటిష్ఠ పరచాలని ఆదేశించారు. జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డ్యూటీ డాక్టర్ల రోస్టర్ జాబితాను అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌లకు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అవసరమయ్యే పరికరాలు తక్కువ ఉన్న యెడల తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలు, ప్రగతి నివేదికను జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ సాయికిరణ్ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను, చికిత్సలను తెలియజేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, వివిధ విభాగాల తీరును ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పల్స్‌పోలియో పోస్టర్, ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, లైసన్ అధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడే పల్స్ పోలియో
- సిద్దిపేటలో 93,667 మంది చిన్నారులు

7లో

నిన్ననే చేరిక.. నేడు టికెట్!

- జహీరాబాద్ బీజేపీ టికెట్ పాటిల్‌కే
- ప్రకటించిన అధిష్టానం
- అసంతృప్తిలో పలువురు నేతలు



బీబీ పాటిల్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 2: బీజేపీలో ఈనెల 1న చేరిన జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు టికెట్ ఖరారు చేస్తూ ఆ పార్టీ అధిష్టానం శనివారం సాయంత్రం ప్రకటించింది. బీఆర్ఎస్ ద్వారా 2014లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన బీబీ పాటిల్ అదేయేడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన జహీరాబాద్ నుంచే బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. రెండోసారి గెలుపొందినప్పటి నుంచి బీబీ పాటిల్ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆయనకే జహీరాబాద్ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తే గెలిచే అవకాశాలు లేవని ఆయన భావించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండింటిలోనే బీఆర్ఎస్ గెలువడం ఆయన పార్టీ మారడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. టికెట్ హామీతోనే శుక్రవారం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరిన పాటిల్‌కు శనివారం తన సిట్టింగ్ స్థానానికి ఆ పార్టీ టికెట్ ఖరారు చేయడం గమనార్హం. ఇలా ఉండగా నిన్ననే చేరిన పాటిల్‌కు టికెట్ ఇవ్వడం పట్ల బీజేపీ శ్రేణులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం కేంద్ర మాజీ మంత్రి, దివంగత ఎ.నరేంద్ర కుమారుడు ఆలే భాస్కర్, పార్టీ నాయకులు ఎం.జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి తదితరులు తమవంతు ప్రయత్నించారు. పార్టీ కోసం కొన్నేళ్లుగా కష్టపడి పనిచేస్తున్న తమకు టికెట్ రాకపోవడంపై వారు నిరాశ చెందుతున్నారు. ఎం.జైపాల్ రెడ్డి అనుచరులైతే జహీరాబాద్ నుంచి నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు.

ఏడుపాయల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- మెదక్ అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు

పాపన్నపేట, మార్చి 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత ఆలయం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశించారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జాతర జరగనున్న నేపథ్యంలో శనివారం ఏడుపాయల అలయ సమీపంలోని హరిత హోటల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, బారీకేడ్లు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జల్లు స్నానాలు, తాగునీటి కుళాయిలు, శౌచాలయాలను త్వరగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల దర్శనార్థం క్యూ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, డీపీవో యాదయ్య, పీఆర్ ఈఈ నర్సింహులు, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజేశ్వర్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత జాతరకు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు మెదక్ రీజియన్ నుంచి 167 బస్సులు నడపనున్నారు.

హుస్నాబాద్ బస్టాండ్‌కు మహర్దశ

- 40 ఏళ్ల అనంతరం ఆధునీకరణ పనులు
- రూ.2 కోట్లు మంజూరు.. 8న శంకుస్థాపన
- బస్టాండ్‌ను సందర్శించిన ఈడీ వినోద్‌కుమార్

హుస్నాబాద్, మార్చి 2 : నాలుగు దశాబ్దాల అనంతరం హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌కు మహర్దశ రాబోతుంది. శిథిలావస్థకు చేరిన బస్టాండ్ రూపురేఖలు మారబోతున్నాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషితో బస్టాండ్‌ను ఆధునీకరించబోతున్నారు. ఈ పనులకు రూ.2 కోట్లు మంజూరు చేయడంతో పాటు ఈ నెల 8న శంకుస్థాపన చేస్తున్నారు.

40 ఏళ్ల బస్టాండ్

హుస్నాబాద్ బస్టాండ్‌ను 1984 జూన్‌లో అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతారావు కృషితో నాటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సంగంరెడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అప్పుడు మూడు ప్లాట్ ఫామ్‌లుండేవి. తదనంతరం పలుమార్లు మరమ్మతులు వంటివి చేశారు. మళ్లీ 2017 ఆగస్టులో రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి రూ.33.59 లక్షలను మంజూరు చేశారు. అప్పుడు హోటల్ గదులను తొలగించి విశాలంగా చేసి ఆధునీకరించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో 8 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి.

ఆధునీకరణకు రూ.2 కోట్లు మంజూరు

హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆధునీకరించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ ఆధునీకరణ పనుల్లో అదనంగా మరో మూడు ప్లాట్‌ఫామ్‌లను నిర్మించనున్నారు. గ్రానైట్, రెయిలింగ్ వంటి పనులతో ఆధునీకరించనున్నారు. ఇప్పటికే హుస్నాబాద్ డిపోకు అదనంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు రాగా బస్టాండ్‌ను ఆధునీకరిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ డిజైన్



హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్



శంకుస్థాపన పనులను పర్యవేక్షించిన ఈడీ

శనివారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ హుస్నాబాద్ బస్టాండ్‌ను సందర్శించారు. శంకుస్థాపన ఏర్పాట్లపై డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, అధికారులతో చర్చించారు. బస్టాండ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ పనుల నిమిత్తం సర్వే చేశారు.

పశుసంవర్ధక శాఖ
ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, మార్చి 2: పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక టీఎన్జీవో భవనంలో, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపాల్, కార్యదర్శిగా లింగమూర్తి, సహాధ్యక్షుడిగా హరిశంకర్, కోశాధికారిగా రాకేష్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ పాని, వీరారెడ్డి, రాజ్‌కుమార్, మంజుల, కార్యదర్శులుగా విశ్వనాథం, చెన్నయ్య, కిషోర్‌కుమార్, భాగ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా గట్టయ్యతోపాటు పలువురు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, సల్లావొద్దీన్, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రతన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కంది, మార్చి 2 : మండలకేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శ్రీరామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, కార్యదర్శి విద్యాధర్ గౌడ్, బిల్ కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● **పుల్‌కల్:** మండలంలోని కోడూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను డీసీసీబీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంసాని రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **సదాశివపేట:** మండలంలోని ఆరూర్ గ్రామంలో రూ.15 లక్షల నిధులతో కొత్తగా నిర్మించే సీసీరోడ్డు పనులను శనివారం తాజా మాజీ సర్పంచ్ నాయికోటి మధు ప్రారంభించారు.

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద
డుకాటి బైక్ క్లబ్ సభ్యుల సందడి

తూప్రాన్, మార్చి 2: రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, డుకాటి క్లబ్ సభ్యులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. శనివారం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. మనోహరాబాద్ పాఠశాల విద్యార్థులకు రోడ్డుభద్రతపై పోటీలు నిర్వహించారు. తూప్రాన్ ఎంజేపీ బాలికల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ హైవే ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు కోడే భారతి, శ్రీనివాస్, పోచాలు తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడే పల్స్ పోలియో కార్యక్రమం, ఏర్పాట్లు పూర్తి
- 0-5 ఏళ్లలోపు పిల్లలకు చుక్కల మందు పంపిణీ
- సంగారెడ్డి జిల్లాలో 1,86,190 మంది, మెదక్‌లో 73,433 మంది, సిద్దిపేటలో 93,667 మంది పిల్లలు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 2: పిల్లల్లో వైకల్య సమస్య రాకుండా, వారి ఆరోగ్య సంరక్షణకు ఏటా వైద్య ఆరోగ్యశాఖ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల మందును వేస్తారు. ఈ నెల 3న నిర్వహించే కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. జోగిపేట ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బూత్‌లల్లో చుక్కల మందు పంపిణీ చేస్తారు. మొదటిరోజు బూత్‌స్థాయిలో, రెండు, మూడురోజుల్లో ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్లను వేస్తారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారు.

సంగారెడ్డి జిల్లాలో 1,86,190 మంది

జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,86,190 మంది ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వాటి పరిధిలో 17,86,422 జనాభా ఉన్నది. నివాస గృహాలు 3,55,775 బూత్‌ల సంఖ్య 1137, రూట్లు 38, రూట్ సూపర్‌వైజర్లు 114, మొబైల్ బృందాలు 38, వ్యాక్సినేటర్లు 4548 మందిని నియమించారు. పోలియో రహిత సమాజం కోసం ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శశాంక్‌దేశ్‌పాండే కోరారు.

మెదక్ జిల్లాలో 73,433 మంది చిన్నారులు

మెదక్ జిల్లావ్యాప్తంగా 457 బూత్‌ల్లో ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో గుర్తించిన 1,74,534 ఇళ్లకు తిరిగి 73,433 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 1046 బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డా.చందునాయక్ కోరారు.





సంగారెడ్డిలోని ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బ్యానర్, పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి: సిద్దిపేట కలెక్టర్

సిద్దిపేట టౌన్, మార్చి 2: ఈ నెల 3, 4, 5న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో పోలియో కార్యక్రమంపై వైద్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు పల్స్ పోలియోకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలోని 2,96,352 గృహాలను సందర్శించి, 93,667 మంది 0-5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలను అందించాలని ఆదేశించారు. దీనికిగాను 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో, 194 ఉప కేంద్రాల పరిధిలో 586 బూతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 306 హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించిన వాటిపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సిద్దిపేట బస్టాండ్‌లో-2, రైల్వేస్టేషన్-1, జగదేవ్‌పూర్-1, రాయపోల్-1, సింగన్నగూడెం-1, గజ్వేల్-3, తీగుల్-1, వర్గల్-2, కోహెడ-1, హుస్నాబాద్-2, చేర్యాల పట్టణం-2, దుబ్బాక పట్టణం-1, కొమరవెల్లి జాతర ప్రాంతాల్లో-3 మొత్తంగా 21 బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను, జాతరలో పాల్గొనే పిల్లలకు రెండు చుక్కలను వేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజిని, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ కిషోర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



సిద్దిపేటలోని కలెక్టరేట్‌లో పల్స్ పోలియో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



రేఖ(ఫైల్)

రాయపోల్, మార్చి 2: వరకట్న వేధింపులకు గురైై ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి, ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన చింతకింది ఎల్లం కూతురు రేఖ(23)ను ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మరదగల్ల బాబుకు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నం కింద బైక్, ఇంటి సామాన్లు, పావు తులం బంగారం ఇచ్చారు. మరో మూడు తులాల బంగారం ఇవ్వాల్సి ఉన్నది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. కొన్నినెలల నుంచి రేఖను అత్తింటి వారు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో రెండుసార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 29న ఓ శుభకార్యం నిమిత్తం రేఖ ముబారస్‌పూర్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం రేఖను తన సోదరుడు ఉప్పరపల్లిలో దింపి వచ్చాడు. శనివారం తెల్లారేసరికి రేఖ అత్తవారింటిలో ఉరేసుకుని మృతిచెందింది. భర్త బాబు, మామ చంద్రయ్య, అత్త రాజమణి, ఆడపడుచు భాగ్యలక్ష్మి కలిసి రేఖను వరకట్న వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకున్నదని మృతురాలి తండ్రి చింతకింది ఎల్లం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు. కాగా మృతురాలికి ఏడాదిన్నరలోపు కుమారుడు ఉన్నారు.

కుంటలో పడి ఒకరి మృతి

కౌడిపల్లి, మార్చి 2: రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కుంటలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని శేరితండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన అజ్మీర రమేష్(29) గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా తండా సమీపంలోని రత్నం కుంటలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నదనే సమాచారం తెలుసుకుని, కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూసి మృతుడు రమేష్ అని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డికి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన కేశవ్ గౌడ్

చేగుంట, మార్చి 2: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కేశవగౌడ్(29) చేగుంటలో అద్దె గదిలో ఉంటూ, ఓ పరిశ్రమలో కూలి పనులు చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమై మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

టేక్మాల్, మార్చి 2: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలంలో చోటు చేసుకున్నది. టేక్మాల్‌కు చెందిన తలారి శివకుమారు(35) శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై టేక్మాల్ నుంచి ఎల్లాస్‌పూర్ వైపు వెళ్తుండగా, ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం ఉదయం గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి



మృతి చెందిన ముస్తఫా

సదాశివపేట, మార్చి 2: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ రోడ్డుపై శనివారం చోటుచేసుకున్నది. పట్టణంలోని 6వ వార్డు సిద్ధాపూర్ కాలనీకి చెందిన ముస్తఫా(30) ఆటోడ్రైవర్. శనివారం సాయంత్రం అతడు ఆటోతో సిద్ధాపూర్ కాలనీ నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తున్నాడు. సిద్ధాపూర్ రోడ్డులో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఎర్రకుంటలో బోల్తాపడింది. తీవ్రగాయాలైన ముస్తఫాను 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గొంతు కోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

సిద్దిపేట క్రైం, మార్చి 2: సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పూరకు చెందిన మండల రాజు అనే యువకుడు పాత కూరగాయల మార్కెట్‌లో శనివారం సాయంత్రం గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రాజును ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాజు ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను పోలీసులు తెలుసుకుంటున్నారు. ప్రేమ వ్యవహారమే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తున్నది.

చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్టు

తూప్రాన్, మార్చి 2: మెదక్, సిద్దిపేట జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని ఓ కేసులో శనివారం అరెస్టు చేసినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన చిన్నమట్టెల భాస్కర్(25) తూప్రాన్, వెల్దుర్తి, చేగుంట, దౌల్తాబాద్ మండలాల్లో గతంలో చోరీలకు పాల్పడి నిందితుడిగా ఉన్నట్లు వివరించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన దుర్గం నగేష్ వాహన బ్యాటరీని అతడు మూడురోజుల క్రితం చోరీ చేశాడు. శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న భాస్కర్‌ను పట్టుకుని బ్యాటరీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

చెరకు తోట దగ్ధం

ఝరాసంగం, మార్చి 2: చెరకు తోటకు నిప్పంటుకుని దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఏల్గోయి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మాణేన్న అనే రైతు రెండు ఎకరాలల్లో చెరకు పంటను సాగుచేశాడు. ప్రమాదవశాత్తు అర ఎకరా చెరకు పంటకు నిప్పంటుకున్నది. అదేవిధంగా డ్రిప్ పైపులు కూడా దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

సెల్ఫీ వీడియో తీసి.. యువకుడి అదృశ్యం

తూప్రాన్, మార్చి 2: కోర్టు కేసు విషయంలో భయాందోళనకు గురైన యువకుడు సెల్ఫీ వీడియో తీసి కనిపించకుండాపోయాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో చోటు చేసుకున్నది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన రాజ్యం లక్ష్మి కొంతకాలంగా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్నది. చిన్న కుమారుడు రాజ్యం గణేష్(24) గతనెల 29న ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రివరకూ రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా పెద్ద కొడుకు రాజ్యం మహేష్ రాత్రి ఇంటికి రాగా గణేష్ ఫోన్ కనిపించింది. ఫోన్‌ను చార్జింగ్ పెట్టి చూడగా.. సెల్ఫీ వీడియోలు కనిపించాయి. గతంలో లక్ష్మి అత్త దుర్గమ్మ, తోటి కోడలు పద్మ గణేష్‌పై కేసు పెట్టారు. కోర్టులో కేసు ఇయరింగ్ ఉండడం, మళ్లీ దుర్గమ్మ గణేష్‌పై శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో తిట్టినట్లుగా ఫిర్యాదు చేసింది. వీటి విషయంలో ఆత్మహత్య ఆత్మహత్య చేసుకుంటానంటూ గణేష్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నట్లు వివరించారు. గణేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ పరిధిలో చైర్మన్ ఆకస్మిక తనిఖీ



ఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఆనంద్ స్వరూప్ షెట్కార్

నారాయణఖేడ్, మార్చి 2: ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శనివారం తెల్లవారుజామున 4 నుంచి 8 గంటల వరకు మున్సిపల్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన చౌక్‌ల వద్ద పారిశుధ్య పనులు, రోడ్లు ఊడ్చే పనులు, ఇంటింటికి తిరిగి ఆటోల్లో చెత్త సేకరణ, తడి, పొడి చెత్తల సేకరణ తీరును పరిశీలించారు. తాగునీటి సరఫరా గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలమైనందున తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు.

మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు

- రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ కరువు
- బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని వేడుకోలు

చేర్యాల, మార్చి 2: కొమురవెల్లి మల్లన్న భక్తులు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ సౌకర్యం కల్పించకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. మల్లన్న ఆలయానికి రాజీవ్ రహదారి మీదుగా అయినాపూర్- తిమ్మారెడ్డిపల్లి శివారు, కొండపాక-కొమురవెల్లి శివారు మీదుగా దారి ఉన్నది. ఎక్కువశాతం కొండపాక స్వాగత తోరణం నుంచి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. సిద్దిపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలుపుతుండటంతో పాటు పక్కనే చిన్నపాటి షెల్టర్, దుకాణాలు ఉండటంతో భక్తులకు కాస్త నీడ లభిస్తున్నది. కానీ సిద్దిపేట వైపునకు వెళ్లడానికి రోడ్డుకు అవతలి వైపున నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారు. షెల్టర్ నిర్మాణం చేయాలని యేటా బ్రహ్మోత్సవ సమీక్షా సమావేశాల్లో ప్రస్తావించడం, సంబంధిత అధికారులు పరిశీలిస్తామంటున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. దీంతో పలుమార్లు భక్తులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పుడిప్పుడే ఎండలు ప్రారంభమవడం, రానున్నరోజుల్లో మరింత దంచికొట్టనున్నందున భక్తులు మరిన్ని ఇక్కట్లు ఎదుర్కునే పరిస్థితి నెలకొన్నది. కాగా రూ.10.32 కోట్లతో కొండపాక స్వాగతతోరణం నుంచి మల్లన్న ఆలయం వరకు గల సింగిల్ లేన్ రోడ్డు డబుల్ లేన్‌గా చేపట్టిన విస్తరణ పనులు పూర్తి కావచ్చాయి. ఇదే చౌరస్తా నుంచి మల్లన్న రైల్వే స్టేషన్‌కు చేరుకోనుండటంతో రానున్న రోజుల్లో మరింత రద్దీ పెరగనున్నది. ఇప్పటికైనా ఆర్టీసీ, మల్లన్న ఆలయాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ వహించి రాజీవ్ రహదారికి అవతలి వైపున ప్రతీ ఆర్టీసీ బస్సు నిలపడంతో పాటు షెల్టర్ ఏర్పాటు చేయించాలని భక్తులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన బస్సుల కోసం ఎండలో ఎదురుచూస్తున్న భక్తులు

విద్యార్థి వికాసంపై పుస్తకం రాసిన బాలుడు

- తాను చదువుతున్న పాఠశాలలో ఆవిష్కరణ

కొండపాక, మార్చి 2: తల్లిదండ్రుల ఆలోచనలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదేళ్ల బాలుడు తోటి విద్యార్థులకు ఉపయోగపడే 'మూర్తిమత్వ వికాసం' పుస్తకాన్ని రాశాడు. దుద్దెడ గ్రామానికి చెందిన కోణం శిరీష-శ్రీకాంత్ దంపతుల కుమారుడు కోణం శ్రవణ్‌తేజ్ కేం బ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాలుగవ తరగతి చదువుతున్నాడు. బేసిక్ లైఫ్ స్కిల్స్ పెంపొందించడంపై 'టెన్ బిఫోర్ టెన్' అనే పేరుతో పుస్తకం రాసి ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు పొందుతున్నాడు. శనివారం పుస్తకాన్ని ఉపాధ్యాయుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మేలు చేకూర్చాలనే సంకల్పంతో బుక్ రాసినట్లు శ్రవణ్‌తేజ్ తెలిపారు. 10 ఏళ్లలోపు విద్యార్థులు విద్యాభివృద్ధికి నేర్చుకోవాల్సిన 10 అంశాలను క్రోడీకరించి పుస్తకం రాసినట్లు పేర్కొన్నారు. తోటి విద్యార్థుల పురోభివృద్ధికి బుక్‌ను రూపొందించడం ప్రశంసనీయమని ఉపాధ్యాయులు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి



ఏవో శ్రావణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 2: జిల్లాలోని కాలుష్య కారక పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయంలో ఏవో శ్రావణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ వ్యర్థ జాలాలు, కలుషిత జలాలు నక్కవాగు ద్వారా మంజీరాలో చేరి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆరోపించారు. పరిశ్రమలను తనిఖీ చేయని పీసీబీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు నర్సింలు, నర్సింహారెడ్డి, మహేష్ ఉన్నారు.

నాగులపల్లిలో హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

వట్‌పల్లి, మార్చి 2: మండల పరిధిలోని నాగులపల్లిలో సమ్మక్క-సారలమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆలయ నిర్వాహకుడు శంకరప్ప ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా.. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చారు. పలు విభాగాల్లో విజేతలుగా నిలిచిన మల్లయోధులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

స్కీముల పేరిట భారీ మోసం

- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కంది, మార్చి 2: స్కీముల పేరిట భారీ మోసం జరిగిన సంఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని కంది మండలంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఎస్టేట్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జూన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ ఆయుర్వేదిక్ కంపెనీలో రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.2 లక్షలు ఇస్తామని సదరు కంపెనీకి చెందిన కొందరు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు అదే ఎస్టేట్స్‌లో నివసిస్తున్న మరికొందరికి ప్రచారం చేశారు. అంతేకాకుండా రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రోజుకు రూ.1350 చొప్పున 150 రోజుల పాటు, మరికొందరికి నెలకు రూ.29 వేల చొప్పున 7 నెలల పాటు చెల్లిస్తామని ఓ ఫేక్ సాఫ్ట్‌వేర్‌ను సృష్టించి మరీ నమ్మించారు. ఈ విషయం నమ్మిన 30 మందికి పైగా ఉద్యోగులు వెనకా ముందు ఆలోచించకుండా ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున వారు కంపెనీ సూచించిన అకౌంట్‌లో డిపాజిట్లు చేశారు. మొదట్లో వారు చెప్పిన విధంగానే కొందరికి చెల్లింపులు జరిగాయి. దాంతో ఈ స్కీమ్‌లో ఆయుర్వేదిక్‌తో పాటు రియల్ ఎస్టేట్స్, గోల్డ్‌స్కీమ్స్ ఉన్నాయని రంగురంగుల బ్రోచర్లు అచ్చు వేయించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. డబ్బులు చెప్పినట్టుగానే ఇస్తున్నారనే నమ్మకంతో తమతో పాటు కుటుంబసభ్యులను, స్నేహితులను, పరిచయస్తులను ఈ స్కీంలో చేర్పించారు. ఆ సంస్థ అనుకున్న దానికంటే ఎక్కువగా ప్రజలు డబ్బులు కట్టి మరీ స్కీంలో చేరడంతో అదును చూసిన సంస్థ బోర్డు తిప్పేసింది. లక్షల్లో నష్టపోయిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులతో పాటు కొందరు బాధితులు తమకు న్యాయం చేయాలని శనివారం కంది పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి

గజ్వేల్, మార్చి 2: నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిస రిగా వేయించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 3వ తేదీన దేశవ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 31 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్స్‌పోలియో కేంద్రాల వద్ద రిసోర్స్ పర్సన్స్, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లను నియమించినట్లు తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు.

- మద్దూరు, మార్చి 2 : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి రజిత, సీహెచ్‌వో శేషగిరి తెలిపారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మద్దూరు పీహెచ్‌సీ పరిధిలో 8 బూత్‌లు, ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- వర్గల్, మార్చి 2 : వర్గల్ మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి హరిత సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ పుట్టిన బిడ్డతో పాటు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలతో పాటు వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ ఆలయం, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం వద్ద ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. అలాగే 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు వేయనున్నట్టు తెలిపారు. మొబైల్ టీం ద్వారా హైరిస్కు ఏరియాలలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 3,654 చిన్న పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మెడికల్ ఆఫీసర్స్, సూపర్వైజర్స్, స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు వలంటీర్లుగా పాల్గొంటారని తెలిపారు.

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో 'భగీరథ' పైపులు ధ్వంసం

- అధికారుల సమన్వయలోపంతో మరమ్మతు పనుల్లో జాప్యం
- ఏడు నెలలకు పైగా చేర్యాలవాసులకు తప్పని ఇక్కట్లు




చేర్యాల పట్టణ శివారులో కల్వర్టు కోసం తీసిన గోతి, మరమ్మతుకు నోచుకోని పైపులైన్



పైప్‌లైన్ ధ్వంసంతో విరజిమ్ముతున్న నీరు

చేర్యాల, మార్చి 2: చేర్యాల పట్టణంలో మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదు. దాదాపు 7 నెలలకు పైగా తరచూ నీటి సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 365-బీ సూర్యాపేట- సిరిసిల్ల జాతీయ రహదారిలో భాగంగా పట్టణంలో జనగామ-సిద్దిపేట ప్రధానదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కల్వర్టులతో పాటు డ్రైన్‌కాలువ పనులు చేపడుతున్న క్రమంలో పలు ప్రదేశాల్లో మెయిన్ పైప్‌లైన్, ఇంట్రావిలేజ్ పైప్‌లైన్ ధ్వంసమయ్యాయి. దీంతో పట్టణంతో పాటు శివారు కాలనీల్లో నీటి సరఫరా నిలిపివేశారు.

పట్టణంలో నీటి సరఫరా డిమాండ్ ఇలా..

పట్టణంలోని 12వార్డుల్లో 20వేలకు పైగా జనాభా, 5,933 ఇండ్లు, 4,570 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో ఇంటికి 135 ఎల్‌పీసీడీ(లీటర్ పర్ కెపాసిటీ డైలీ) డిమాండ్ ఉండగా, ప్రస్తుతం 70ఎల్‌పీసీడీ నీటిని మాత్రమే అందిస్తున్నారు. ఇవి కాకుండా గతంలో నుంచి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకోసం 131 పవర్‌బోర్లు, 21వాటర్‌ట్యాంకులు వినియోగించారు. కానీ మిషన్ భగీరథ పైప్ లైన్ ధ్వంసం కావడంతో పవర్‌బోర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా సరిపోవడంలేదు.

మరమ్మతు పనుల్లో జాప్యం

రోడ్డువిస్తరణ పనులకు సంబంధించి డ్రైన్, రోడ్డు, విద్యుత్ లైన్, వాటర్ పైప్‌లైన్ సవరణలకు ఒక్కో విభాగానికి సంబంధించి వేర్వేరుగా పనులు నిర్వహిస్తున్నప్పటికీ అత్యంత అవసరమైన తాగునీటి విషయాన్ని విస్మరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్రావిలేజ్‌తో పాటు మెయిన్ పైప్‌లైన్ నష్టానికి సంబంధించి ముందస్తుగానే నష్టం అంచనావేసినప్పటికీ కాంట్రాక్టర్ సత్వర పనులు చేపట్టకపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమవుతుంది.

> **మరమ్మతులు చేయిస్తున్నాం**
>
> విస్తరణ పనుల్లో కల్వర్టుల నిర్మాణంతోపాటు డ్రైన్‌కాలువల నిర్మాణానికి గోతులు తీస్తుండటంతో అక్కడ క్కడా మెయిన్ పైప్‌లైన్ ధ్వంసమైతే ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షించి సత్వరంగా మరమ్మతులు చేయి స్తున్నాం. వీలైనంత వరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.
>
> వేణుగోపాల్, ఏఈఈ, మద్దూరు గ్రిడ్

విద్యార్థుల తంటాలు

పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో సుమారు 250మంది, గురుకుల పాఠశాలలో సుమారు 450మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో బోర్లు ఉన్నా నీరు ఏమాత్రం సరిపడక పోవడంతో మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా తరచూ అవాంతరాలు ఎదురవుతుండటంతో నీటిసరఫరా నిలిచి స్నానాలకు ఇబ్బందులుపడుతున్నారు. వంతుల వారీ స్నానాలు చేస్తూ తంటాలుపడుతున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీటిని పంపిస్తున్నా సరిపోని పరిస్థితి నెలకొన్నది.

సమన్వయ లోపం.. తప్పని వేసవి తిప్పలు

ఎన్ హెచ్, మున్సిపల్, మిషన్ భగీరథ అధికారుల మధ్య సమన్వయలోపంతో పాటు ప్రత్యామ్నాయ పనులు వేగవంతానికి నోచుకోవడం లేదు. రానున్న వేసవికాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కునే అవ కాశం ఉంది. మరి కొద్దిరోజులపాటు రోడ్డువిస్తరణ, డ్రైన్ కాలువ పనులు కొనసాగనున్నందున అక్కడక్కడా పైప్‌లైన్ ధ్వంసం అయ్యే పరిస్థితి లేకపోలేదు. ఆయాశాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

జగదేవ్‌పూర్, మార్చి 2: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత పేర్కొన్నారు. మండలంలోని ధర్మారంలో బాల్య వివాహం చేస్తున్నారని చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు సమాచారం రావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, బాలల సంరక్షణ విభాగం నుంచి బాలల సంరక్షణ అధికారి రాజు, చైల్డ్ లైన్ నుంచి కేస్ వర్కర్ వినోద ధర్మారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన బాలిక(16)కు తల్లిదండ్రులు అక్కడే వివాహం చేయ నిశ్చయించారు. దీంతో ఆ అమ్మాయి ఇంట్లో నుంచి వెళ్లిపోయి ధర్మారంలోని వాళ్ల బాబాయ్ ఇంటికి వచ్చింది. అమ్మాయితో పాటు బంధువులకు సైతం సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేయబోమని వారిని ఒప్పించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి: ఎంపీపీ



మహ్మదాపూర్‌లో వాటర్ ట్యాంకు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

హుస్నాబాద్ రూరల్, మార్చి 2: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లకావత్ మానస పేర్కొన్నారు. శనివారం మండలంలోని మహ్మదాపూర్‌లో రూ.20 లక్షలతో మంజూరైన తాగునీటి ట్యాంకుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, ఎంపీటీసీ పిట్టల శ్రావణీ, తాజా మాజీ సర్పంచ్ పిట్టల సంపత్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీనా తస్కిన్, ఏఈ మమత, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోతారం(ఎస్)లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 2: మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో క్రిష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9,10న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు మడక కృష్ణ తెలిపారు. పోటీలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు అవసరం లేదన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు 9010373752, 9989050283, 9951340634 నంబర్లకు సంప్రదించి తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని కోరారు.

హుస్నాబాద్‌లో చెత్త బుట్టల పంపిణీ

హుస్నాబాద్ టౌన్, మార్చి 2 : హుస్నాబాద్ పట్టణంలోని 15వ వార్డులోని ప్రజలకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్ వాల నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 11వ వార్డులో కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ చెత్త బుట్టలను పంపిణీ చేశారు.

నంగునూరులో స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంగునూరు, మార్చి 2: నంగునూరు ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులు వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించగా మరి కొందరు డీఈవో, ఎంఈవో, హెచ్‌ఎంగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ తహసీల్ సుల్తానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏ ఇవ్వాలి

కొండపాక, మార్చి 2 : ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లును, డీఏలను సాధ్యమైనంత తొందరగా ఇవ్వాలని టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైవీ సురేష్ కుమార్, హెచ్ రవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల మొదటి తేదీన ఉపాధ్యాయుల జీతాలను ఖాతాల్లో జమ చేసినట్టే ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను, డీఏలను కూడా వీలైనంత తొందరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యుడు

దుబ్బాక/మిరుదొడ్డి, మార్చి 2: విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన జరుగుతుందని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు నరేష్ పేర్కొన్నారు. శనివారం భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మూఢ నమ్మకాలను వీడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాలమల్లయ్య, హెచ్ఎం అంజయ్య, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

బెక్కల్ ఆలయం పాలక మండలి ప్రమాణ స్వీకారం

మద్దూరు, మార్చి 2: దూళిమిట్ట మండలం బెక్కల్ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులకు శనివారం ఆలయ ఈవో విశ్వనాథ శర్మ ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొమురవెల్లి ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటక లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, కామిడి జీవన్‌రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, సందిటి లక్ష్మీ, ఊట్ల శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్‌గా చొప్పరి మల్లేశం, సభ్యులుగా ఇమ్మడి శోభ, దారావత్ సిరిరాం, చెన్నోజు బ్రహ్మాచారీ, రాజపేట మల్లేశం, స్వర్గం సాంబయ్య ప్రమాణ స్వీకారం చేశారు.

ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

మద్దూరు, మార్చి 2: మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలకు పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ ఏఆర్ఎస్ ప్యాకెట్లు, ఆయింట్‌మెంట్, ట్యాబెట్లు, ఆయోడిన్ అందించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడారు. ఎండలు తీవ్ర రూపం దాల్చుతుండటంతో మంచినీటి వసతులతో పాటు ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రాథమిక చికిత్స కోసం మందులు అందజేసినట్లు తెలిపారు.

దూళిమిట్ట తహసీల్దారు బెజ్జంకి మండలానికి బదిలీ

మద్దూరు/బెజ్జంకి, మార్చి 2: దూళిమిట్ట మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దారు వి. శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ మను చౌదరి బెజ్జంకి మండలానికి బదిలీ చేశారు. ఈ మేరకు బెజ్జంకిలో పని చేస్తున్న తహసీల్దారు వై. శ్యామ్ దూళిమిట్ట మండలకేంద్రానికి బదిలీపై వచ్చారు. కాగా బెజ్జంకి తహసీల్దార్‌గా వి. శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ

సిద్దిపేట క్రైం, మార్చి 2 : ఏబీవీపీ అమరవీరుల దినోత్సవ సందర్భంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరవీరులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి పేరాల శేఖర్ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల పోరాడుతున్నది విద్యార్థి సంఘం ఏబీవీపీ అని గుర్తు చేశారు. అనంతరం మెదక్ విభాగ్ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ వివేక్ వర్ధన్ మాట్లాడుతూ నక్సల్ రాడికల్స్ చేతిలో దేశం కోసం ప్రాణాలర్పించిన 40 మంది విద్యార్థి పరిషత్ కార్యకర్తలకు విద్యార్థులు అందరు ఘన నివాళి పలకాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘటన మంత్రి లక్ష్మిపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిత్య నగర కార్యదర్శులు హరీశ్, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ములుగు మండలంలో విద్యుత్ అంతరాయం

ములుగు, మార్చి 2: ములుగు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని సంబంధిత విద్యుత్ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలన్నింటికీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్‌లో కొన్ని పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. 10 గంటల తర్వాత సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



సిద్దన్నపేట స్టేజి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నంగునూరు, మార్చి 2 : కాలువల ద్వారా సాగునీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శనివారం నంగునూరు మండలం సిద్దన్నపేట స్టేజి వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండు వేసవిలో సైతం చెరువులను నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుండగా ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల చెరువులకు చుక్క నీరురాని పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రంగనాయకసాగర్ కాల్వ ద్వారా మండలంలోని చెరువులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కాళేశ్వరం నీళ్లు చెలకలు పట్టుకొని పోతున్నాయి కానీ చెరువుల్లోకి చేరడం లేదని ఆరోపించారు. మండలంలోని సిద్దన్నపేట గ్రామంలోని ఎర్రగుంట, ఇప్పలకుంటకు కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల చెరువులకు చుక్క నీరు చేరడం లేదని అన్నారు. పది రోజులుగా మండలంలో కాలువల ద్వారా నీళ్లు వస్తున్నప్పటికీ తమ గ్రామానికి రాకపోవడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. అధికారులు కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్లే చెరువులోకి నీళ్లు రావడం లేదన్నారు. సంబంధిత శాఖ అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు తెలిపారు. రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న రాజగోపాలపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడించి రైతులకు నచ్చజెప్పారు.

సీజ్ చేసిన ఇసుక మాయం



మద్దూరు: జాలపల్లి శివారులో ఇసుకను సీజ్ చేసిన పోలీసులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2: ఏడాది క్రితం రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా తరలించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో మండల ఇన్‌చార్జి తహసీల్దార్ వీరేష్ ఏడాది క్రితం రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి సుమారు 30 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. గ్రామంలోని శ్మశానవాటిక వద్ద ఇసుక డంపును సీజ్ చేయగా, గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా తరలించారు. ఈ విషయంపై గతంలో గ్రామస్థులు తహసీల్దార్‌తో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. సీజ్ చేసిన ఇసుకను తరలిస్తున్నారని అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోలేదు. దీంతో మొత్తం 30 ట్రిప్పులకు గానూ 20 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ జయంత్‌ను, మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేస్తే కేసునమోదు చేస్తామన్నారు. నేటికీ ఇసుకను తరలించినవారిపై చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాలపల్లివాగు వద్ద ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు, మార్చి 2: దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామ శివారు వాగు వద్ద అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను చేర్యాల సీఐ ఎల్. శ్రీను మద్దూరు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీతో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను దూళిమిట్ట తహసీల్దారు కు తదుపరి చర్యల కోసం అప్పగించినట్లు తెలిపారు.

పాత దొమ్మాటలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల, మార్చి 2: చేర్యాల మండలం పాతదొమ్మాట గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

ఆడపిల్లను సమాజంలో ఎదిగేలా ప్రోత్సహిద్దాం: సీడీపీవో



బాలికల జడ్పీఎస్ఎస్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చేర్యాల, మార్చి 2: ఆడపిల్లను భారంగా కాకుండా సమాజంలో నిలబడి ఎదిగేలా ప్రోత్సహిద్దామని సీడీపీవో శారద పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా బుధవారం చేర్యాల పట్టణంలోని బాలికల జడ్పీఎస్ఎస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శారద మాట్లాడుతూ సమాజాభ్యున్నతిలో పాటు పోటీతత్వ సమాజానికి దీటుగా ఆడపిల్లలను తీర్చిదిద్దాలన్నారు. మహిళా, శిశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళ హెల్ప్‌లైన్, 181 సేవలు, చిల్డ్రన్స్ హెల్ప్‌లైన్ 1098, సఖీ, అంగన్‌వాడీ సేవలు ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధి ఎ. పద్మ, వి.లావణ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, హెల్త్ సూపర్‌వైజర్ ఆగమణి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి తుమ్మలతో సిద్దిపేట నాయకులు

సిద్దిపేట టౌన్, మార్చి 2: హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో శనివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు మంత్రిని కలిసిన వారిలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్‌అహ్మద్, సిద్దిపేట జిల్లా సీనియర్ నాయకులు ఆత్మరాములు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు

సిద్దిపేట క్రైం, మార్చి 2 : సిద్దిపేట సీసీఎస్ ఏసీపీగా జగదీశ్ చందర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా సిద్దిపేట వన్ టౌన్ సీఐగా టి.లక్ష్మీబాబు పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు మర్యాద పూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను వేర్వేరుగా కలసి ఫ్లవర్‌బొకేను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని సూచించారు.



సీపీకి పూల మొక్కను అందజేస్తున్న సీఐ టి.లక్ష్మీబాబు, సీసీఎస్ ఏసీపీ జగదీశ్ చందర్

మార్చి 16న జాతీయ లోక్ అదాలత్

సిద్దిపేట క్రైం, మార్చి 2: ఈ నెల 10వ తేదీన సిద్దిపేట జిల్లా కోర్టు భవనంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న జరగవలసిన జాతీయ లోక్ అదాలత్‌ను శివరాత్రి పండుగ సందర్భంగా ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థుల నైపుణ్యం వెలికి



ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న విద్యార్థి

సిద్దిపేట టౌన్, మార్చి 2: విద్యార్థుల మేధస్సును వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని గౌతమ్ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అంధులకు ఉపయోగపడే కళ్లద్దాలు, రైతులకు ఉపయోగపడే స్నేక్ స్టిక్ లాంటి పలు ఆవిష్కరణలతో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన

మద్దూరు, మార్చి 2 : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు దరఖాస్తులను శనివారం జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ అధికారి సుహాసిని ధూళిమిట్ట తహసీల్ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారం 6,7,8లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్, ఆర్ఐ అయిలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, మార్చి 2: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, హరితహారం ప్రత్యేకాధికారి సామల్ల ఐలయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సిద్దిపేట అర్బన్, మార్చి 2: విపంచి కళా నిలయంలో వికాస్ హై స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థిని విద్యార్థులచే శనివారం గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ హై స్కూల్ చైర్మన్ ప్రముఖ సర్జన్ డాక్టర్ భాస్కరరావు మరియు డెంటల్ సర్జన్ స్వామి హాజరై విద్యార్థులకు సమాజం పట్ల చదువు పట్ల మెదులుకునే విధానం పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మధుమోహన్ ఉపాధ్యాయులు రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 2: ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐవీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నే కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు సునీత, సీఎస్.రవి, డీవో రాజు, వారికి సహకరించిన డీఐఈవో సూర్యప్రకాష్ పై చర్యలు తీసుకోవాలని శనివారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం సబ్జెక్టు టీచర్ పరీక్షలు నిర్వహణ సమయంలో కళాశాలలోకి రాకూడదనే నిబంధనలను పక్కనపెట్టి పరీక్ష హాల్లోకి వెళ్లిన టీచర్ పరీక్ష పూర్తయ్యేంత వరకు అక్కడే ఉండి విద్యార్థులకు పూర్తిగా సహకరించినట్టు వారు ఆరోపించారు. ఈ విషయమై డీఐఈవోకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, లేదా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు ట్రాక్ సూట్‌ల అందజేత



క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను అందజేసిన జడ్పీటీసీ కొండల్ రెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 2: నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ లో ఈ నెల 4న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర 70వ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు వారం రోజుల నుంచి శిక్షణ పూర్తి చేసుకున్నది. సదరు క్రీడాకారులకు సిద్దిపేటలో కబడ్డీ గ్రౌండ్‌లో శనివారం ట్రాక్ సూట్‌లను జడ్పీటీసీ కొండల్ రెడ్డి అందజేశారు. క్రీడాకారులకు వారం రోజులకు వారికి సంబంధించిన శిక్షణ, వసతి, భోజనం ఇతర సౌకర్యాలను ఆయన కల్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ... రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట జిల్లా జట్టును ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాజలింగం, శ్రీకాంత్, ప్రశాంత్, మహేష్, నరేంద్రబాబు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.